



శంకర్‌పల్లి మండలం శేరిగూడ రోడ్డు ఇలా..



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

## క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలి

» ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించినప్పుడే ఆ గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు వస్తాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న అండర్-14, అండర్-17 జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి రోజు 34 పాఠశాలల నుంచి కబడ్డీ పోటీలు కొనసాగగా, బుధ, గురు వారాల్లో వాలీబాల్, ఖోఖో పోటీలుంటాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో పోరాట పటిమ, శారీరక ఎదుగుదలతోపాటు ఏకాగ్రతను పెంచుతాయన్నారు. ఇబ్రహీంపట్నంలో మినీ స్టేడియం ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం రెవెన్యూ అధికారులతో సంప్రదిస్తున్నామన్నారు. అనంతరం క్రీడాకారులకు టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, క్రీడల జోనల్ సెక్రటరీ సుశీల, పీఈటీలు రాజు, మల్లేష్, కృష్ణ, అంజి, రాజశేఖర్, వినయ్, శేఖర్, యాదమ్మ, కవితలు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో స్కాలర్‌షిప్ ఫైల్స్ దగ్ధం



కాలిపోయిన రికార్డులను పరిశీలిస్తున్న సీఐ గంగాధర్

కడ్తాల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం స్కాలర్‌షిప్స్ రికార్డులు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన గిరిజన స్కాలర్ షిప్స్ మ్యానువల్ ఆన్‌లైన్ స్పైరల్ బాండింగ్ హార్డ్ కాపీస్ స్థల ప్రభావం కారణంగా ఐదేళ్ల క్రితం మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో భద్రపర్చారు. కాగా, గదిలో షార్ట్ సర్క్యూట్‌తో 1982 నుంచి 2015 వరకు సంబంధించిన ఫైల్స్, రికార్డులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ మేరకు హెచ్‌డబ్ల్యూవో బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలిపోయిన ఫైల్స్‌ను, రికార్డులను సీఐ గంగాధర్ పరిశీలించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

# ఇదేం దారిద్రం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని రోడ్లు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు నానా ఇక్కట్లు పడుతున్నారు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా చిన్న, పెద్ద రోడ్లన్నీ ఎటు చూసినా బురద గుంటలతో దర్శనమిస్తున్నాయి. పలు చోట్ల వంతెనలు ధ్వంసం కావడంతో చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల నీటితో నిండి రోడ్ల ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఈ రోడ్లపై నిత్యం ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తిరుగుతున్నా మరమ్మతులకు మాత్రం నోచుకోవడం లేదు.

(ఆంధ్రజ్యోతి ,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, నెట్‌వర్క్)



షాబాద్ మండలం రుద్రారంలో గుంతలమయంగా రోడ్డు

### భయంభయంగా ప్రయాణం

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- తరుచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అధ్వానంగా ఆదిభట్ల - నాదర్‌గుల్ రోడ్డు



కోతకు గురైన పద్మారం- చౌదరిగూడ బీటీ రోడ్డు

## వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసం

వికారాబాద్ జిల్లాలో వాహనాల రద్దీ అధికంగా ఉండే వికారాబాద్ - తాండూరు, వికారాబాద్ - సదాశివపేట్, తాండూరు - కోట్‌పల్లి, సదాశివపేట్ - వికారాబాద్, వికారాబాద్ - మన్నేగూడ, పరిగి - నస్కల్ తదితర మార్గాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. గుంతలను తప్పించుకుంటూ రోడ్లపై నడిపించడం వాహనదారులకు సవాల్‌గా మారింది. పగటి వేళలో ఈ పరిస్థితి ఉంటే రాత్రివేళలో వాహనం నడిపించే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రోడ్లపై ఏర్పడ్డ గుంతలతో ప్రమాదాల బారిన పడి వాహనదారులు మృత్యువాత పడుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురియక ముందే రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని ఉంటే కొంత వరకైనా వాహనదారులకు ఇబ్బందులు తప్పేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాన మార్గాల్లో

మిగతా 7వ పేజీలో...

### మేడ్చల్ నియోజకవర్గంలో..

ఘట్‌కేసర్ పరిధిలోని ప్రతాప్‌సింగారం నుంచి ఉప్పల్ రోడ్డులో ముత్వెల్లిగూడ వద్ద రోడ్డు గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అవుశాపూర్ వద్ద వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపైకి వరదనీరు వచ్చి చేరి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. చీకట్లో ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో రోడ్లపై నీరు నిలిచి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ - కొంపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో, మూడుచింతలపల్లి - ఉద్దమర్రి మార్గంలో రోడ్డు దెబ్బతిన్నది.

### ధ్వంసమైన వంతెన

షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వాగుపై నిర్మిస్తున్న వంతెన ధ్వంసం కావడంతో సుమారు రూ.4 కోట్లు నష్టం వాటిల్లింది. కొందుర్గు మండలం తంగళ్లపల్లి - వెంకిర్యాల వంతెన కోసం చేపట్టిన పనులు వర్షాలకు పూర్తిగా దెబ్బతినడం వల్ల రూ.కోటి వరకు నష్టం వాటిల్లింది. కేశంపేట మండల పరిధిలో కొత్తపేట - కోనాయిపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కేశంపేట - చౌలపల్లి, లేమామిడి- నిడుదవెల్లి మధ్యంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. చౌదరిగూడ మండల పరిధిలోని పద్మారం నుంచి చౌదరిగూడ వరకు ఇటీవల నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డు వర్షానికి కోతకు గురైంది. జిల్లేడు నుంచి చౌదరిగూడకు వచ్చే సీసీరోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. నందిగామ - చెగూరు వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా మారిరాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందిగామ మండల కేంద్రం నుంచి బైపాస్ రోడ్డు వరకు దెబ్బతిన్నది.



వర్షానికి భారీగా గోతులు పడ్డ తుమ్మలూరు రోడ్డు



చేవెళ్ల మండలం ఆలూర్ నుంచి శంకర్‌పల్లి వెళ్లే రోడ్డుపై గుంతలు



వినియోగించని పశువుల పాత దవాఖాన భవనం

# నిరుపయోగం.. భవనాలు శిథిలం

బూతు బంగ్లాలుగా ప్రభుత్వ నిర్మాణాలు

- పందులు, పాములకు ఆవాసాలు
- వినతులిచ్చినా వినిపించుకోని వైనం
- పాతవి తొలగించి కొత్తగా నిర్మించాలని డిమాండ్

ఆమనగల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏళ్ల తరబడి నిర్వాహణ, వినియోగంలో లేక ప్రమాదకర స్థితికి చేరాయి. శిథిల భవనాలను తొలగించకపోవడంతో పందులు, విష సర్పాలకు ఆవాసాలుగా మారాయి. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన అనేక భవనాలు కూలే చేరుకున్నాయి. పిచ్చి మొక్కలతో మండల పరిషత్ ఆవరణ కళాహీనంగా మారింది. వినియోగంలో లేని శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలని పలుమార్లు స్థానిక నేతలు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదు. దశాబ్దాల క్రితం అప్పటి పంచాయతీ సమితి సిబ్బంది ఉండడానికి క్వార్టర్లు, వ్యవసాయ శాఖ

మిగతా 8వ పేజీలో...

### భవనాలను వినియోగంలోకి తేవాలి



ఆమనగల్లు పట్టణంలో పలుచోట్ల నిరుపయోగంగా ఉన్న భవనాలను, గోదాంలను వినియోగంలోకి తేవాలి. వాటికి మరమ్మతులు చేయాలి. శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలి. గోదాంలను మరమ్మతు చేసి వినియోగంలోకి తెస్తే మండల పరిషత్‌కు ఆదాయం వస్తుంది.

- విక్రమ్ రెడ్డి, బీజేపీ మున్సిపల్ కన్వీనర్, ఆమనగల్లు

## రైతులకు విధిగా రసీదులివ్వాలి

» జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష

ఆమనగల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయానికి సంబంధించి డీలర్లు విధిగా రైతులకు రసీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.ఉష అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి డీలర్లు నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు మండలంలో మంగళవారం డీఏవో ఉష పర్యటించారు. పట్టణంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. తనిఖీలో ఏడీఏ శోభారాని, ఏవో శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

### ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు

కేశంపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో చేరుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవో, కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మంగళవారం మంగళవారం ప్రకటనలో తెలిపారు. పీఎంశ్రీ జెడ్పీహెచ్‌ఎస్ కొత్తపేటలో ఓపెన్ స్కూల్ ఈ నెల 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. చదువు మధ్యలో ఆపివేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8309865919లో సంప్రదించాలని కోరారు.

# దొంగఓట్లు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

» కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



సంతకాల సేకరణలో కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి దొంగ ఓట్లు గొడ్డలి పేటు అని, రాజ్యాంగం, రిజర్వేషన్లపై బీజేపీ దాడి చేస్తోందని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహే ష్‌కుమార్ గౌడ్ పిలుపు మేరకు మంగళవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప బాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డితో కలిసి మండంలోని ఆకుల మైలారంలో ఓట్ల చోరీపై నిర్వహించిన సంతకాల సేకరణలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న కొన్ని వర్గాల ఓట్లను బీజేపీ తొలగించడానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గం పరిధిలోని జల్‌పల్లి మున్సిపాలిటీలో వేలాది దొంగ ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. ఈమేరకు ప్రతి బూత్ స్థాయిలో పార్టీ ఆధ్వర్యంలో ఓటర్లతో సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అంతకుముందు గ్రామంలోని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన కొందరు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్.సురేందర్, బి.ప్రశాంత్‌కుమార్, నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రాంరెడ్డి, సరికొండ మల్లేష్, బొక్క భూపాల్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, ఎండీ.అఫ్జల్‌బేగ్, రాకేష్‌గౌడ్, చిర్ర సాయిలు, మంద సాయిలు, సరికొండ జగన్, మహేందర్, కవిత పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

## సీజేఐపై దాడి హేయమైన చర్య

» సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమణ

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి పూనుకోవడం హేయమైన చర్య అన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.వీ.రమణ, జిల్లా కార్యదర్శి పి.యాదయ్య అన్నారు. సోమవారం కోర్టు హాలులో న్యాయవాది రాకేష్ కిషోర్ సీజేఐ గవాయ్‌పై బూటు విసిరేందుకు పూనుకోవడాన్ని నిరసిస్తూ మంగళవారం ఇబ్రహీంపట్నంలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత ఛాందసంతోనే న్యాయవాది ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. రాజ్యాగంపట్ల, ప్రాజాస్వామ్యం పట్ల కొందరు ఏమాత్రం గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సామేల్, నర్సింహ, బుగ్గరాములు, ఎల్లేష్, ప్రకాశ్‌కారత్, శంకర్, యాదగిరి, వంశి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఇబ్రహీంపట్నంలో భారీ వర్షం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ సహా రూరల్ ప్రాంతంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. జనం పనులు ముగించుకుని ఇళ్లకు చేరే సమయంలో ఒక్కసారిగా వర్షం రావడంతో ఎక్కడిక్కడే ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్లపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షంతో ఇబ్రహీంపట్నం టౌన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి జనం ఇబ్బందులు పడ్డారు.

# ఉపకార వేతనాలు రాలేదని..

» విద్యార్థులను అనుమతించని 'బీఏఎస్'



ఆమనగల్లులోని ప్రజ్ఞ బెస్ట్ అవలెబుల్ స్కూల్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆమనగల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ఉపకార వేతనాలు విడుదలయ్యే వరకు పాఠశాలలోకి అనుమతివ్వమని ఆమనగల్లు ప్రజ్ఞ బెస్ట్ అవలెబుల్ స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు తేల్చి చెప్పింది. మూడేళ్లుగా ఉపకార వేతనాలు అందకపోతే తాము పాఠశాలను ఏవిధంగా నిర్వహిస్తామని పేర్కొంది. దసరా సెలవుల అనంతరం మంగళవారం విద్యార్థులను తీసుకొని పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులను యాజమాన్యం పాఠశాలలోకి అనుమతించలేదు. దీంతో పిల్లలతో కలిసి తల్లిదండ్రులు పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో గురుకుల, సెమీ రెసిడెన్సియల్ విధానంలో విద్యా బోధనకు ప్రవేశపెట్టిన బెస్ట్ అవలెబుల్ స్కీం(బీఏఎస్) కింద 2008 నుంచి ఆమనగల్లులో ప్రజ్ఞ ఉన్నత పాఠశాల కొనసాగుతుంది. పాఠశాలలో 450 మంది విద్యార్థులుండగా, డే-స్కాలర్ విద్యార్థికి రూ.28 వేలు, రెసిడెన్సియల్ విద్యార్థికి రూ.42 వేలు ప్రభుత్వం చెల్లించేది. కాగా 2023 నుంచి ఆయా విద్యార్థుల ఉపకార వేతనాలు అందలేదు. మొత్తం రూ.4.50 కోట్లు ఉపకార వేతనాలు అందాల్సి ఉందని, పాఠశాలల్లోకి విద్యార్థులను అనుమతించవద్దని తీసుకున్న నిర్ణయం మేరకు లోనికి అనుమతించలేదని ప్రజ్ఞ బీఏఎస్ యాజమాన్యం స్పష్టం చేసింది. మూడేళ్ల కాలంగా బిల్లులు రాకపోవడంతో నిర్వాహణ భారంగా మారిందని పేర్కొంది.

# 24 నిమిషాల్లో ఎయిర్‌పోర్టు టు కిమ్స్

» గ్రీన్ చానల్ ద్వారా ఆస్పత్రికి లంగ్స్ చేరవేత




ఎయిర్‌పోర్టులో లంగ్స్‌ను తీసుకొస్తున్న సీఆర్‌పీఎఫ్, వైద్య సిబ్బంది

శంషాబాద్ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి వరకు ట్రాఫిక్ పోలీసులు మంగళవారం సాయంత్రం గ్రీన్ చానెల్ ఏర్పాటు చేశారు. 24 నిమిషాల వ్యవధిలోనే లంగ్స్ ఆస్పత్రికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఎ.సన్యాసిరావు(67) బ్లెడ్ గ్రూప్ ఓ పాజిటివ్, బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు లంగ్స్ దానం చేయడానికి ముందుకొచ్చారు. దీంతో సికింద్రాబాద్ కిమ్స్‌లో ఉన్న ఒక పెషెంట్‌కు కావాలని డాక్టర్లకు సమాచారం అందించడంతో వైజాగ్‌లో ఉన్న లంగ్స్‌ను ఎయిరిండియా విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తరలించారు. ఇప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న సిబ్బంది శంకర్ గణేష్, రాజేష్, డ్రైవర్ అజీజ్ వెంటనే లంగ్స్‌ను అంబులెన్స్‌లో పెట్టుకుని 24 నిమిషాల్లోనే సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి చేర్చారు. ఆస్పత్రిలో ఉన్న పెషెంట్‌కు అమర్చినట్లు సిబ్బంది చెప్పారు. విమానం దిగగానే నేరుగా అంబులెన్స్ వద్దకు చేరుకునేలా కృషి చేసిన సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




## కాగ్నాకు గంగా హారతి

తాండూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తాండూరు కోకట్ గ్రామ సమీపం లోని వంతెన పక్కన మంగళవారం కాగ్నా నదికి మంగళ హారతి కార్యక్రమాన్ని బ్రాహ్మణ, అర్చక, పురోహితుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతీ పౌర్ణమి రోజున నిర్వహించే గంగా హారతిలో భాగంగా ప్రత్యేకంగా గంగా పూజ, గంగాకు దీపోత్సవం తదితర కార్యక్రమాలను చేపట్టారు.

# బీజేపీలో గ్రూపు రాజకీయాలు

## క్రమశిక్షణ కమిటీ వద్దకు పంచాయితీ

- ఎంపీకి, పార్టీ జిల్లా అధ్యక్షుడికి మధ్య విభేదాలు
- రెండు వర్గాల వాదనలు విన్న పార్టీ పెద్దలు



తాండూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సమయమొచ్చినా బీజేపీలో గ్రూపు విభేదాలు చల్లారడం లేదు. ఓ వైపు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వర్గం.. మరోవైపు పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి గ్రూపులుగా ఏర్పడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో మంగళవారం పార్టీ అధిష్ఠానం రెండు వర్గాల నాయకులను బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పిలిపించింది. క్రమశిక్షణా కమిటీ ప్రతినిధులు ధర్మరావు నేతృత్వంలో రెండు వర్గాల వారి వాదనలు వింది. జిల్లాలో అత్యధిక వర్గపోరు తాండూరు బీజేపీలోనే కొనసాగుతోందనే ప్రచారం ఉంది. ఇదే అంశంపై మంగళవారం తాండూరు బీజేపీ నాయకులే క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేసి తమ వాదనలు వినిపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిని మార్చాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పార్టీ పెద్దల వద్ద పట్టుబట్టారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, జిల్లా అధ్యక్షుడిని సైతం అవమానపరుస్తున్నారని బీజేపీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి బాలేశ్వర్‌గుప్తా, నాయకులు సుదర్శన్‌గౌడ్, పటేల్ విజయ్‌కుమార్ అధిష్టానానికి ఫిర్యాదుచేశారు. ఈ సమయంలో రాజశేఖర్‌రెడ్డి కూడా అక్కడే ఉన్నారు. ఎన్నికల సమయంలో గ్రూపులు సరికాదని, కలిసి పనిచేయాలని పార్టీ రాష్ట్ర నేతలు నాయకులను హెచ్చరించినట్టు తెలిసింది. వారి ఫిర్యాదులు, వాదనలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు దృష్టికి తీసుకెళ్తామని నేతలన్నారు. కొంత కాలంగా తాండూరులో రాష్ట్ర నాయకులు యు.రమేష్, బాలేశ్వర్‌గుప్తా వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ నాయకుల మధ్య ఏర్పడుతున్న విభేదాలతో రాష్ట్ర నేతలు సైతం తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం. వీరి పంచాయితీలను త్వరగా తీర్చాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు పార్టీ పెద్దలను కోరుతున్నారు.

## గురుకుల ఉపాధ్యాయుడికి డాక్టరేట్



హెచ్‌సీయూ వీసీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న విఠల్ రాథోడ్

కొడంగల్ రూరల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): కృషి వుంటే మనుషులు రుషులవుతారని మరోసారి రుజువు చేశాడు గిరిజన బిడ్డ విఠల్ రాథోడ్. అతడు ప్రఖ్యాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ సాధించాడు. మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ఆడిటోరియంలో నిర్వహించిన యూనివర్సిటీ 25వ కాన్వకేషన్‌లో హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ బీజే. రావు నుంచి విఠల్ రాథోడ్ పీహెచ్‌డీ అందుకున్నారు. బషీరాబాద్‌కు చెందిన నాగిబాయి-రామునాయక్‌ల ద్వితీయ కుమారుడు విఠల్. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి ప్రోత్సాహంతో చదువుకున్నాడు. బషీరాబాద్‌లో పదో తరగతి, తాండూర్‌లో ఇంటర్, 2017లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ ఎంఏ ఇంగ్లీష్ చేశారు. 2015లో ఉస్మానియా నుంచి బీఈడీ, ఆచార్య నాగార్జున వర్సిటీ నుంచి ఎంఈడీ చేశారు. 2020లో హెచ్‌సీయూ పీహెచ్‌డీలో అడ్మిషన్ పొందాడు. నెట్ సాధించి రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్‌నకు ఎంపికై నెలకు రూ.53వేల చొప్పున ఐదేళ్లు స్టైఫండ్ అందుకున్నాడు. పీహెచ్‌డీలో భాగంగా జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో ప్రజెంటేషన్‌లు ఇచ్చారు. ఇండియా కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) ప్రోత్సాహంతో 2023 జనవరిలో దక్షిణాఫ్రికా రాజధాని కేప్‌టౌన్‌లో.. 'బ్లెండెడ్ లెర్నింగ్ ప్రభావవంత అభ్యసనకు హైబ్రీడ్ బోధన నమూనా' అనే అంశంపై ప్రజెంటేషనిచ్చాడు. హెచ్‌సీయూలో కేరళకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ గీతాగోపినాథ్ పర్యవేక్షణలో స్వదేశీ విద్యార్థుల జీవన నైపుణ్యాలు అనే అంశంపై పరిశోధన చేసి జూన్ 2024లో థీసెస్ సమర్పించాడు. 2025 ఫిబ్రవరిలో హెచ్‌సీయూ వైవా పరీక్షలో డాక్టరేట్ ప్రకటించారు. ఈ క్రమంలో 2023లో గురుకుల పరీక్షలో టీజీటీ-ఇంగ్లీష్ పోస్టుకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం విఠల్ కొడంగల్ సమీపంలోని ఎంజేపీటీ గురుకుల పాఠశాల (దౌల్తాబాద్)లో విధులు నిర్వహిస్తున్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడాలి

చేవెళ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి పరిరక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభులింగం కోరారు. మంగళవారం చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్యను ఆయన కార్యాలయంలో సీపీఐ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని న్యాలటలో గల సర్వే నంబర్ 240లోని భూమిని కొందరు కబ్జా చేసి క్రయవిక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి విడిపించాలని అధికారులను కోరారు. సీపీఐ నాయకులు మక్బూల్, మల్లాని సుధాకర్‌గౌడ్, శివ, కిష్టయ్య, అంజయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో గల ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం కడ్తాల్, ఆమనగల్లు మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, మానయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అభ్యర్థుల ఎంపికపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రిజర్వేషన్లతో అవకాశం రాని వారికి నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాభిమానం ఉండి, పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులొస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు అనితవిజయ్, అనంతరెడ్డి, మండ్లీ రాములు, రమణారెడ్డి, జహంగీర్ అలీ, పి.రాములు, చేగూరి వెంకటేశ్ పాల్గొన్నారు.

## సుమిత్రాబాయి మృతికి నేతల సంతాపం



తలకొండపల్లి: పీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ తల్లి సుమిత్రబాయి మృతికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ రవి సంతాపం తెలిపారు. కల్వకుర్తిలోని ఆమె నివాసంలో సుమిత్రాబాయి మృతదేహానికి నివాళులర్పించారు. నెలరోజుల వ్యవధిలో రతన్‌సింగ్‌ఠాకూర్-సుమిత్రాబాయి దంపతుల మృతి బాధాకరం అన్నారు. బాలాజీసింగ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాయకులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, వస్పుల జంగయ్య, ఆరిఫ్, జనార్ధన్‌రెడ్డి, అజీజ్, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆనంద్, వెంకట్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, వెంకటేశ్వర్ రావు, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## నిలిచిన తాగునీటి సరఫరా

- కొట్టుకుపోయిన మిషన్ భగీరథ పైపులు
- జుంటివాగు ఉధృతికి లైన్ కట్ ● రెండు రోజులుగా నీరు బంద్
- త్వరలోనే పునరుద్ధరిస్తామంటున్న అధికారులు


జుంటివాగు వరద ఉధృతికి కొట్టుకుపోయిన మిషన్ భగీరథ పైపులు

బషీరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్-తాండూరు రోడ్డు పక్కన జుంటివాగు ఉధృతికి మిషన్ భగీరథ పైపులు కొట్టుకుపోయాయి. చెక్‌డ్యాం వద్ద తాగునీటి సరఫరా మెయిన్‌లైన్ పైపులు డ్యామేజై నీటి సరఫరా నిలిచిందని గ్రిడ్ అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల కింద కురిసిన వర్షానికి జుంటివాగు ఉప్పొంగింది. చెక్‌డ్యాం కింద పైపులైన్ కొట్టుకుపోయి నీటి సరఫరా నిలిచింది. ఇప్పటికీ వరద పారుతోందని, ఇప్పుడే కొత్త పైపులు వేసే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లోని నీటి వనరులను వినియోగించుకోవాలని కోరుతున్నారు. రెండు, మూడు రోజుల్లో పైపులు వేసి సరఫరాను పునరుద్ధరిస్తామని మిషన్ భగీరథ తాండూరు డివిజన్ డీఈ విజయ్, ఏఈ సోయేల్ మంగళవారం తెలిపారు.

## భవానీమాత ఆలయంలో చీరల పంపిణీ


ముత్తైదువులకు అమ్మవారి చీరలు అందజేస్తున్న పూజారి శంకర్‌స్వామిజీ

బషీరాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దామర్‌చెడ్ అంబా భవానీ మాత ఆలయంలో ముత్తైదువులకు అమ్మవారి చీరల పంపిణీ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పూజారి శంకర్ స్వామీజీ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేయగా మహిళలు పెద్దసంఖ్యలో హాజరైయ్యారు. శంకర్‌స్వామిజీ ఆలయం చుట్టూ భక్తులతో కలిసి ప్రదిక్షణలు చేయించి ప్రవచనాలు విన్పించారు. ఆయన మట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని, ఆధ్యాత్మికంతో జీవితం సుఖమయం అవుతుందని సూచించారు. కార్యక్రమంలో నవాంధ్గీ సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## మహిళాభ్యున్నతికి కృషి అభినందనీయం


పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న ఆర్మీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారిత కోసం పుస్తక రచన అభినందనీయమని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా ఆర్మీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. అంకుశాపూర్‌లోని సంక్షేమ గురుకుల మహిళా ఆర్మీ కళాశాల అధ్యాపకురాలు అరుణ.. 'తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర' అనే అంశంపై వ్యాసాన్ని రచించారు. మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి అరుణ నిరంతరం కృషిచేస్తున్నారని గుర్తుచేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనేదే ఆమె తపన అన్నారు. ఉద్యమంలో మహిళల పాత్ర గురించి వ్యాసాన్ని రాయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అరుణను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రమాదేవి, తెలుగు లెక్చరర్ శ్రీవర్ధిని పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న రామిరెడ్డి తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో సివిల్ ఇంజినీర్ల పాత్ర కీలకమని క్రెడాయ్ చైర్మన్ జి.రామిరెడ్డి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన భవనాల్లో లీకేజీలు, సీపేజీల నివారణపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవ భారత నిర్మాణంలో సివిల్ ఇంజినీర్లే ముఖ్య భూమిక పోషిస్తున్నారని గుర్తుచేశారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మక దృక్పథం పెంపొందించుకునేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడుతయన్నారు. భవనాల్లో లీకేజీలు, సీపేజీలను అరికట్టేందుకు సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. ఇంజినీర్లు ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో డీన్లు విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన మనోహర్‌రెడ్డి

- స్థానిక ఎన్నికల నేపథ్యంలో నాయకుల భేటీపై చర్చ


నారాయణరావు ఇంట్లో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావును తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి మంగళవారం బషీరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనతో ప్రత్యేక భేటీ అయి చర్చించారు. ఇద్దరు నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై, ప్రస్తుత బీసీ రిజర్వేషన్లపై రానున్న హైకోర్టు తీర్పు అంశంపై చర్చించినట్టు సమాచారం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆయా పార్టీల గెలుపోటములపై కూడా సుమాలోచనలు చేసినట్లు తెలిసింది. ఎన్నికల్లో నారాయణరావు కుటుంబం నుంచి బరిలో ఎవరు నిలుస్తారనే దానిపై ఏకాంతంగా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. బషీరాబాద్ మండల ఎంపీపీ, జెడ్పీటీసీల స్థానాలు బీసీలకు రిజర్వు అయినందున.. 'మీ కుటుంబం నుంచి ఎవరైనా పోటీ చేస్తారా?' అని ఎమ్మెల్యే, నారాయణరావుతో మాట్లాడినట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి నారాయణరావు ఇంటికి వెళ్లి కలవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. వీరి భేటీలో సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, పెద్దేముల్ మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీగౌడ్, బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఎస్.వెంకటేష్, గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాము, పవన్, సాయిల్‌గౌడ్ పాల్గొన్నారు.

## మేడ్చల్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలో
## 118 షాపులకు 54 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పేట్ బషీరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధి మద్యం షాపుల లైసెన్స్‌లకు దరఖాస్తులు తీసుకుంటున్న ట్లు మేడ్చల్ జిల్లా ప్రొహిబిషన్ అధికారి ఎస్‌కె పయాఉద్దీన్, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ, బాలానగర్ ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ యాదయ్యలు తెలిపారు. రాష్ట్రంలో మద్యం దుకాణాల కేటాయింపునకు నోటిఫికేషన్ జారీ చేశారని, మేడ్చల్ జిల్లా యూనిట్‌లో మొత్తం 118మద్యం షాపు లు ఉండగా వాటిలో 45 దుకాణాలకు ధరఖాస్తులు వచ్చాయన్నారు. బాలానగర్‌లో 10, కుత్బుల్లాపూర్‌లో 16, మేడ్చల్‌లో 28 ధరఖాస్తులు నమోదయ్యాయి. బాలానగర్‌లో 42దుకాణాలకు 2షాపులను ఎస్సీల కు, కుత్బుల్లాపూర్‌లోని 47 దుకాణాలకు ఐదు గౌడ కులస్తులకు, 1 ఎస్టీ, ఎస్సీలకు ఒక్కోటి కేటాయించామన్నారు. అలాగే మేడ్చల్‌లోని 29 దుకాణాలకు ఆరు గౌడ కులస్తులకు, 2 షెడ్యూల్ కూలాలకు కేటాయించినట్లు తెలిపారు. మిగిలినవి జనరల్ కేటగిరీకి వస్తాయన్నారు. ఈ నెల 18 దరఖాస్తులకు చివరి తేదీ అని, 21 సంవత్సరాలు కంటే ఎక్కువ వయసున్న వారు ఎవరైనా నాన్ రిఫండబుల్ మొత్తం రూ.3లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లక్కీ డ్రా ద్వారా షాపులను కేటాయిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8712658727, 8742658741 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు,



కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న అడ్వకేట్లు

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

వికారాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ మాట్లాడుతూ సీజేఐపై దాడి దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలు ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం కోల్పోయే ప్రమాదాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటరెడ్డి, ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, కమల్‌రెడ్డి, అశోక్ కుమార్, శంకరయ్య, వసుందర, శ్రీలత, రాంచందర్‌రావు, రాంచందర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, మాధవరెడ్డి, జగన్ రాజు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుతాం

» చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి




స్వచ్ఛ ట్రక్కులను ప్రారంభిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా పదేళ్లుగా తన ఫౌండేషన్ కృషిచేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్‌లో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు కొత్త స్వచ్ఛ ట్రక్కులను ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గం పరిధి 11మండలాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను క్లీన్‌గా ఉంచేందుకు 11 స్వచ్ఛ ట్రక్కులు పనిచేస్తున్నాయన్నారు. వీటికి అదనంగా ఐదు ట్రక్కుల రాకతో వాటి సంఖ్య 16కి చేరిందన్నారు. ఈ ట్రక్కుల ద్వారా పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రం చేయించమేకాక స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఒక్కో ట్రక్కు 30పాఠశాలల్లో సేవలందిస్తోందని, మొత్తం 330 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతకు 16 ట్రక్కులను వినియోగిస్తున్నామని తెలిపారు.

## పాడైన పంటలకు పరిహారమివ్వాలి

బంట్వారం అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వారం రోజుల కింద కురిసిన వర్షాలకు బంట్వారం, నూరుల్లాపూర్, యాచారం, సుల్తాన్‌పూర్, నాగ్వారం తదితర గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. తమకు పరిహారం ఇవ్వాలని మండల రైతులు మంగళవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి వినతిపత్రం ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ.. వర్షాలతో పంటలు నాశనమయ్యాయని, దిగుబడి రాదని చెప్పారు. మండలంలో 180 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం తమకు ఆర్థికసాయం అందించాలని కోరారు. వెంటనే పంటనష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రాంరెడ్డి, నర్సిములు, బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్, ముస్తఫా, కిష్టయ్య, జగదీష్ పాల్గొన్నారు.

## పెంచిన బస్ చార్జీలను తగ్గించాలి



జాపాలలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచాల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బస్‌చార్జీల పెంపును నిరసిస్తూ మంగళవారం జాపాలలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చార్జీలను పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపడం అన్యాయం అన్నారు. ఆర్టీసీ, ప్రభుత్వం చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మాజీ సర్పంచ్ నాగరాజు, బి.చంద్రకాంత్, బీఎస్.సతీష్, యాదయ్య, బి.సోమేశ్, సంజీవ, దర్శన్, రవి, యాదయ్య, వెంకటేష్, నర్సింహ పాల్గొన్నారు.

# ఇదేం 'దారి'ద్రం

(ఐదో పేజీ తరువాయి)

రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. వికారాబాద్ - మోమిన్‌పేట్ రోడ్డులో కొత్త గడి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనాలు నియంత్రణ కోల్పోయి చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇటీవల నలుగురు మృతి చెందారు. గుంతలమయంగా మారిన రోడ్లతో జిల్లాలో వారానికి పది నుంచి ఇరవై వరకు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

### కోట్‌పల్లి అలుగు ఉధృతికి..

ధారూరు నుంచి నాగసముందర్ గ్రామానికి వెళ్లే రోడ్డు కోట్‌పల్లి అలుగెత్తి ప్రవహించడంతో పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో రూ. 50 లక్షలు ఖర్చు చేసి బ్రిడ్జి నిర్మించినా అది నాసిరకంగా ఉండడంతో మళ్లీ కొట్టుకుపోయింది. ధారూరు నుంచి కేరెళ్లి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు సైతం గుంతలతో దర్శనమిస్తోంది. మోమిన్‌పేట నుంచి శంకర్‌పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు, ఎన్కతల-సదాశివపేట రోడ్డు, గోవిందాపూర్-కద్పర్ల, వెల్చాల్ - దుర్గంచెరువు, టేకులపల్లి - గోవిందాపూర్ పీఆర్ రోడ్లు పాడై ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బంట్వారం మండలంలో ఉన్న రోడ్లన్నీ గుంతలమయంగా మారి ప్రయాణీలకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. యాచారం చౌరస్తా - బంట్వారం, బంట్వారం - తొర్మామిడి ఆర్‌అండ్‌బీ రోడ్లు, నూర్లాపూర్ - యాచారం గేటు, రొంపల్లి పీఆర్ రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. పట్లూర్- కోట్‌పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు, రావులపల్లి - కల్కోడ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారాయి.



వరదకు కొట్టుకుపోయిన కోకట్ వంతెన



వర్షాలకు దెబ్బతిన్న నాగారం మెయిన్ రోడ్డు

### కొట్టుకుపోయిన కోకట్ బ్రిడ్జిపై రోడ్డు...

తాండూరు నియోజకవర్గంలో యాలాల మండలం కోకట్ పురాతన బ్రిడ్జిపైన రోడ్డు కొట్టుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు తాండూరు-కోట్‌పల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డులో గుంతలు పడి సుమారు ఐదుకోట్ల వరకు నష్టం వాటిల్లింది. తాండూరు-తొర్మామిడి రోడ్డుకు సుమారు రూ 2 కోట్ల వరకు నష్టం వాటిల్లింది. పరిగి డివిజన్‌లోని పరిగి, పూడూరు, కులకచర్ల, దోమ, చౌడాపూర్ మండలాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిగి - మిట్టకోడూరు, యాబాజీగూడ, ఇబ్రహీంపూర్, రాకొండ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దోమ, పాలేపల్లి, ఐనాపూర్, మల్లేపల్లి, మోత్కూర్, ఐనాపూర్ రోడ్లు రాకపోకలకు వీలు కాకుండా మారాయి. కులకచర్ల నుంచి బండవెల్కిచర్ల, రుక్కుంపల్లి వెళ్లే రోడ్లు కోతకు గురయ్యాయి. నస్కల్ శివారు తోపాటు పూడూరు మండలం రాకంచర్ల నుంచి కంకల్ వెళ్లే రోడ్డు కూడా గుంతలమయంగా మారాయి. కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో పలు రోడ్లు కోతకు గురయ్యాయి. కొడంగల్ మండలంలోని ఎరన్‌పల్లి-ఆశమ్మకుంట తండా రోడ్డుతో పాటు పెద్దనందిగామ, చిట్లపల్లికి వెళ్లే మార్గాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి.

### హైదరాబాద్ - బీజాపూర్ జాతీయరహదారి..

హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల మండలంలోని పామెన, చన్‌వెల్లి, బస్తేపూర్, మల్కాపూర్, ఆలూర్, తల్లారం, కౌకుంట్ల, అంతారం, ముడిమ్యాల్, కుమ్మెర, రావులపల్లి, ఈర్లపల్లి, ఎన్కెపల్లి, దేవరంపల్లి తదితర గ్రామాల్లోకి వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే షాబాద్ మండలంలోని హైతాబాద్, చందనవెల్లి, ఎట్లఎర్రవల్లి, దోస్వాడ, రుద్రారం, సోలిపేట్, మద్దూర్ తదితర గ్రామాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. మొయినాబాద్ మండలంలో వెంకటాపూర్, పెద్దమంగళరం, శ్రీరాంనగర్, సురంగల్, ఎన్కెపల్లి, చిలుకూరు గ్రామాల రోడ్లు కూడా గుంతలమయంగా మారాయి. శంకర్‌పల్లి మండలంలో పొద్దటూర్, ఎల్వర్తి, టంగటూర్, శేరిగూడ, గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. చేవెళ్ల - శంకర్‌పల్లి రోడ్డుపై ఈర్లపల్లి నుంచి ఎల్వర్తి వరకు గుంతలు పడ్డాయి.

### గుంతలతో వాహనదారుల ఇక్కట్లు

మహేశ్వరం నియోజకవర్గంలో తుమ్మలూరు మీదుగా అటు మహేశ్వరం, ఇటు హైదరాబాదు ప్రధాన రహదారిలో ప్రతిరోజు వందలాది వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. రోజూ వందలాది వాహనాలు వెళ్లే ఈ రోడ్డు వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నది. భారీగా గోతులు ఏర్పడ్డాయి. గోతులను పూడ్చాలని తుమ్మలూరు గ్రామస్తులు సంబంధిత అధికారులను వేడుకున్నా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాగారం నుంచి కోళ్లపడకల్ వెళ్లే ప్రధాన రహదారి వర్షాల కారణంగా నాగారం వద్ద గుంతలు ఏర్పడి వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా మారింది.



వర్షాలకు గుంతలమయంగా మారిన అంకిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డు

### అధ్వానంగా పట్నం రహదారి

ఇబ్రహీంపట్నం పరిధిలోని రాయపోల్ - పోల్కంపల్లి, దండుమైలారం - నెర్రెపల్లి, పోల్కంపల్లి - నెరెపల్లి పంచాయతీరాజ్ రోడ్లు, ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ నుంచి నాదర్‌గుల్ వెళ్లే రోడ్డు గుంతలుపడి అధ్వానంగా మారింది. ఇబ్రహీంపట్నం - నాగన్‌పల్లి వెళ్లే రోడ్డు, ఇంజాపూర్ - తుర్కయాంజాల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా పాడైంది. ఇక్కడ రూ.3 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా టెండర్ ప్రక్రియ పూర్తయినా కాంట్రాక్టరు పనులు చేపట్టడం లేదు.

## మోకాళ్ల లోతు నీటిలో ..

### ఎల్లమ్మ గుడికి వెళ్లాలంటే భక్తులకు తప్పని తిప్పలు



రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న భక్తులు

మహేశ్వరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వర్షం పడిందంటే చాలు తుక్కుగూడ మున్సిపాలిటీలోని సర్దార్‌నగర్ నుంచి రావిర్యాల వెళ్లే ప్రధాన రహదారి వర్షం నీటితో చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డులో రెండు గ్రామాల ప్రజలే కాకుండా, శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వెళ్లేందుకు ప్రతి మంగళవారం వేలాదిగా భక్తులు తరలివెళ్తారు. మోకాళ్ల లోతు నీటిలోంచి ఆలయానికి వెళ్లక తప్పని పరిస్థితి. కొందరు ట్రాక్టర్లు, కార్లు, ఆటోల ద్వారా ఆలయానికి చేరుకుంటున్నారు. సర్ధార్‌నగర్ నుంచి రావిర్యాల వరకు శాశ్వత పరిష్కారం లభించేలా రోడ్డు పనులు పూర్తి చేయాలంటే రూ.10 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు. కానీ, కార్యరూపం దాల్చడంలేదు. ఫలితంగా వాహనదారులు, ఎల్లమ్మ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

## లేటొచ్చారని గేటు బయటే..

» గురుకుల విద్యార్థులు, తల్లిదండ్రుల పడిగాపులు

» ఇది సరికాదని తల్లిదండ్రుల ఆగ్రహం



గురుకుల పాఠశాల గేటు వద్ద వేచి ఉన్న విద్యార్థులు

కొడంగల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో ఇళ్లకు వెళ్లిన గురుకుల విద్యార్థులు పాఠశాలకు ఆలస్యంగా రావడంతో మంగళవారం బయటే పడిగాపులు కాశారు. కొడంగల్ శివారులోని తాండూర్ రోడ్డులో దౌల్తాబాద్ బీసీ గురుకుల విద్యార్థులు దసరా అనంతరం మంగళవారం పాఠశాలకొచ్చారు. సోమవారం రావాల్సిన వారు ఒక్కరోజు ఆలస్యంగా రావడంతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను గేటు బయటే నిలిపారు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహంతో నిర్వాహకులను ప్రశ్నించారు. స్థానిక మీడియా ప్రతినిధులు ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడగా మధ్యాహ్నం 12:30 తర్వాత పాఠశాలలోకి అనుమతించారు. ఉదయం నుంచి ఖాళీ కడుపుతో ఎండలో విద్యార్థులు, తల్లిదండ్రులు వేచి ఉన్నారు. సెలవుల అనంతరం బ్యాంకు ఖాతా, ఆధార్ అప్డేషన్లతో రావాలని విద్యార్థులకు యజమాన్యం సూచించారని, దీంతో మీ సేవ కేంద్రాలకు తిరగడం వల్ల ఆలస్యం అయిందని తల్లిదండ్రులు వాపోయారు. ఒక్క రోజు ఆలస్యంగా వస్తే ఇన్ని ఇబ్బందులు పెడతారా? అని మండిపడ్డారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్ స్పందిస్తూ.. తాము ఆర్సీవో ఆదేశం మేరకే నడుచుకోవాల్సి ఉంటుందని చెప్పారు. కాగా ఇక్కడ గెస్ట్ ఫ్యాకల్టీని సైతం వేధిస్తున్నారని పలువురు తెలిపారు. విద్యార్థుల పడిగాపులపై ఆర్సీవోను వివరణ కోరగా సమాధానం చెప్పకుండా దాటవేశారు.

## మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న కాంగ్రెస్




మాట్లాడుతున్న మెతుకు ఆనంద్

వికారాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ముస్లింలను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగానే వాడుకుంటోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ముస్లింలను ఓట్ల కోసమే వాడుకుంటుందని, వారికి మెరుగైన జీవన స్థితిగతులను కల్పించడం లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ముస్లింల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామన్నారు. యువతకు 80శాతం సబ్సిడీతో రుణాలు, మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ చేశామన్నారు. కేసీఆర్ పాలనలో మైనారిటీ రెసిడెన్షియల్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. మైనార్టీ డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్ ఇప్పుడా మాటే ఎత్తడం లేదన్నారు. ఒక్క మైనార్టీకి కూడా క్యాబినెట్‌లో చోటివ్వలేదన్నారు. కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత వాగ్దానాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ముస్లింలు, ఇతర మైనారిటీ వర్గాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు గోపాల్, మాజీ కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ముర్తుజా అలీ, సుభాన్‌రెడ్డి, ఫరీద్, ఇస్మాయిల్, షఫీ, దత్తు పాల్గొన్నారు.

## ఆలయాలను పట్టించుకోని ఎమ్మెల్యే

» సబితారెడ్డికి మదర్సాలు, మసీదులంటేనే ఇష్టం

» మహేశ్వరం బీజేపీ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్



సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ రోడ్డుపై పారుతున్న నీటిని పరిశీలిస్తున్న శ్రీరాములు

మహేశ్వరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే సబితారెడ్డికి మదర్సాలు, మసీదులపై ఉన్న ప్రేమ హిందూ ఆలయాలపై ఎందుకు లేదని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ప్రశ్నించారు. మంగళవారం తుక్కుగూడలోని సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ రోడ్డును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి ఎంతటి విశిష్టత ఉందో అదే తరహాలో ప్రతీ మంగళవారం పదివేల మందికిపైగా భక్తులు సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వస్తారని తెలిపారు. మరి ఈ ఆలయ అభివృద్ధి ఎమ్మెల్యే ఎందుకు సహకరించడంలేదని ప్రశ్నించారు. తుక్కుగూడ, రావిర్యాల నుంచి ఆలయానికి వెళ్లే రోడ్డు వాన నీటితో మునిగిపోమయిందని, ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటులో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. ఒకవర్గం ఓట్లతో గెలిచిన సబితారెడ్డి.. అదే వర్గానికి చెందిన ప్రార్థన మందిరాలకే ప్రాధాన్యం ఇస్తూ హిందూ ఆలయాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ప్రభుత్వం కూడా ఆయాలను పట్టించుకోవడంలేదన్నారు. ఎల్లమ్మ ఆలయ రోడ్డు సమస్యను పరిష్కరిస్తానన్న సబితారెడ్డి ఇప్పుడు తన పార్టీ అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎల్లమ్మ ఆలయ రోడ్డును బాగు చేయించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో తుక్కుగూడ మునిసిపల్ మాజీ చైర్మన్ కె.మధుమోహన్, నాయకులు శివకుమార్, రాజు, హేమలత, యాదగిరిరెడ్డి, లక్ష్మణ్, విలాస్, శ్రీను, శ్రీనివాస్‌నాయక్, సుధాకర్, మహేశ్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

# ఎక్లాస్‌ఖాన్‌పేట నుంచి సంగెంకు తరలింపు

## ఎమ్మెల్యే లెటర్‌తో ప్రీ ప్రైమరీ స్కూల్ మార్పు

» టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

» కూతురి ఉద్యోగం కోసం చక్రం తిప్పిన వ్యక్తి..?



పాతబడిన సంగెం పాఠశాల

కేశంపేట,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రాజకీయ చక్రం తిప్పారు.. ఎమ్మెల్యే లెటర్‌ను ఉపయోగించి నోటిఫికేషన్‌లో లేని పాఠశాలకు ప్రీ ప్రైమరీ స్కూల్‌ను తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు సైతం నూతన భవనం, వసతులున్న పాఠశాలను వదిలేసి.. పాత పాఠశాల భవనంలోకి ప్రీప్రైమరీ స్కూలును తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. వివాహమైన తన కూతురికి ఉద్యోగం ఇప్పించుకునేందుకే ఓ వ్యక్తి ఎమ్మెల్యే లెటర్‌ను వాడుకొని ఇదంతా చేస్తున్నాడనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ అంశం వివరాల్లోకి వెళ్తే.. సర్వశిక్షా అభియాన్ కింద కేశంపేట, ఎక్లాస్‌ఖాన్‌పేటలో ప్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు టీచర్లు, ఆయా పోస్టులకు సెప్టెంబరు 1న ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ నోటిఫికేషన్ ఇచ్చారు. సెప్టెంబరు 6 వరకు పోస్టులకు దరఖాస్తులు స్వీకరించారు. ఫైనల్ చేసేందుకు త్రీమెన్ కమిటీ సిద్ధమైంది. ఇంతలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ సెప్టెంబరు 1న విద్యాశాఖకు లెటర్(నంబర్ 2086) రాస్తూ ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఏర్పాటు కానున్న ప్రీ ప్రైమరీ స్కూల్‌ను సంగెంకు మార్చాలని కోరారు. దీంతో సెప్టెంబరు 19న సంగెంలో ప్రీ ప్రైమరీ స్కూలు ఏర్పాటుకు కలెక్టర్ నుంచి ఇన్‌చార్జి ఎంఈవోకు ఆదేశాలందాయి. దసరా సెలవులు ఉండడంతో ఈ విషయం అప్పట్లో బయటకు పొక్కలేదు.

### ప్రీ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు ఎక్కడంటే..

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా ప్రీ ప్రైమరీ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ స్కూళ్లకు అనుబంధంగా వీటిని పెడుతున్నారు. నాలుగేళ్లు నిండిన పిల్లలను వాటిల్లో చేర్చుకుని ఆటపాటలతో బోధిస్తారు. పిల్లలకు ఐదేళ్లు రాగానే అదే ప్రాంగణంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పుతారు. అయితే యూడీఐఎస్‌సీ(ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలు కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్)లో ఒక్క విద్యార్థి కూడా సంగెం నుంచి నమోదు కాలేదు. పాత పాఠశాలలో వసతుల్లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరి ఇక్కడికి ప్రీ ప్రైమరీ పాఠశాలకు మార్చడం ఎవరి ప్రయోజనం కోసమని స్థానికులు చర్చించుకుంటున్నారు.



ఎక్లాస్‌ఖాన్‌పేటలోని పాఠశాల భవనం

### టీచర్, ఆయా పోస్ట్‌లకు దరఖాస్తుల స్వీకరణ

ఎక్లాస్‌ఖాన్‌పేట ప్రీ ప్రైమరీ పాఠశాల కోసం టీచర్, ఆయా పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. టీచర్ పోస్టుకు ఇంటర్ విత్ డీఈడీ ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలని, కచ్చితంగా గ్రామానికి చెందిన వారై ఉండాలనేది నిబంధన. టీచర్ పోస్టుకు టి.చైతన్య(ఇంటర్-డీఈడీ), ఎస్.కావేరి(ఇంటర్), కె.శ్రావణి(ఇంటర్), ఇ.సంతోష(ఇంటర్)లు దరఖాస్తు చేసుకున్నారు. ఆయా పోస్టుకు అఫ్రిన్ ఒక్కరే దరఖాస్తు చేసుకుంది. అధికారులు వీరిలో ఇద్దరిని ఫైనల్ చేసినట్లు సమాచారం.

### సంగెం పాఠశాలకు ఒకే దరఖాస్తు?

సంగెంలో ప్రీప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు అధికారులు సెప్టెంబరు 19న నోటిఫికేషనిచ్చారు. టీచర్, ఆయా పోస్టులకు మాత్రం నోటిఫికేషన్ ఇవ్వలేదు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చక్రం తిప్పి వివాహమైన తన కూతురికి టీచరు పోస్టు ఇప్పించేందుకు దరఖాస్తు చేయించినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారులు విచారణ చేసి అవసరం, పిల్లలు ఎక్కువగా, వసతులు ఉన్న చోటే ప్రీ ప్రైమరీ స్కూలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# సీజేఐపై దాడి హేయం

- చేవెళ్ల, ఆమనగల్లు న్యాయవాదులు
- విధులు బహిష్కరించి నిరసన




చేవెళ్ల/ఆమనగల్లు : విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చేవెళ్ల/ఆమనగల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై దాడి హేయమని, రాజ్యాంగంపై దాడి చేయడమేనని చేవెళ్ల కోర్టు న్యాయవాదులు అన్నారు. ఈమేరకు మంగళవారం చేవెళ్ల బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం. నర్సింలు ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి సందర్భంలోనూ సహించబోమన్నారు. దేశ అత్యున్నత పదవుల్లో ఒకరైన సీజేఐపై షూతో దాడికి యత్నించడం దారుణమన్నారు. నిందితుడు న్యాయవాది రాకేశ్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ట్రెజరర్ ఇ.రవీందర్‌రెడ్డి, లైబ్రేరియన్ మల్లేశ్, స్పోర్ట్స్ సెక్రటరీ ప్రభాకర్, సభ్యులు తలారి ప్రకాశ్, ఈశ్వరయ్య, రవీందర్, శివరాజ్, ప్రదీప్‌రెడ్డి, కుమార్, వెంకటేశం, జైపాల్, తాజొద్దీన్, గౌతమ్‌రెడ్డి, శివరాజ్, నాగిరెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్, ఆనంద్, మహేశ్, సతీష్, స్వప్న, ప్రవీణ, లోకేశ్వరి తదితరులు ఉన్నారు.

అదేవిధంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేశ్ కిశోర్ దాడి యత్నాన్ని ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఖండించింది. దాడిని నిరసిస్తూ ఆమనగల్లు న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. కోర్టు ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. యాదిలాల్ మాట్లాడుతూ సీజేఐపై దాడి చరిత్రలో చీకటి రోజు అన్నారు. దాడికి పాల్పడ్డ న్యాయవాదిపై కఠిన చర్యలు చేపట్టాలని, సీజేఐ దాడి ప్రజాస్వామ్య మూలాలపై దాడి అని వ్యాఖ్యానించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్‌గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వస్పుల మల్లేశ్, న్యాయవాదులు జానకి రాములు, మధుగౌడ్, గణేశ్‌గౌడ్, దేవేందర్, జగన్‌గౌడ్, ఆంజనేయులు, శేఖర్, మహేశ్వర్, శ్రీనివాస్, బీక్యానాయక్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగం.. భవనాలు శిథిలం

(ఐదో పేజీ తరువాయి)

ద్వారా వచ్చే సామగ్రి నిల్వ చేయడానికి గోదాంలు నిర్మించారు. కాల క్రమేణ మండలాలు ఏర్పడి అధికారులు స్థానికంగా నివాసం ఉండక పోవడం, భవనాలు వినియోగించక చాలావరకు పైకప్పులు, గోడలు దెబ్బతిన్నాయి. వర్షాలకు కొన్ని చోట్ల కూలిపోయాయి. గోదాంలను తాత్కాలికంగా మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. జాతీయ రహదారిని అనుసరించి ఉన్న పాత పశువుల దవాఖాన భవనం కూడా నిరుపయోగంగా మారింది. ఆసుపత్రికి కొత్త భవనం నిర్మించి పాత భవనాన్ని వృథాగా వదిలివేయడంతో మూగజీవాలకు అవాసంగా మారింది.



నిరుపయోగంగా గోదాంలు



శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ సిబ్బంది క్వార్టర్లు

### మరమ్మతులు చేసినా..

విద్యుత్ కార్యాలయం సమీపంలో ఇరిగేషన్ శాఖ కార్యాలయ భవనం కూడా వృథాగా ఉంది. దీన్ని దశాబ్దం క్రితం లక్షలు వెచ్చించి మరమ్మతు చేసినా వినియోగంలోకి తేలేదు. అంగడి బజారులో మాంసం విక్రయ కేంద్రం, చేనేత సంఘం భవనంది కూడా ఇదే పరిస్థితి. పలు చోట్ల సామూహిక భవనాలు భిక్షగాళ్లకు ఆవాసంగా మారాయి. మార్కెట్ యార్డ్‌లో రైతు విశ్రాంతి భవనం, క్యాంటీన్, మరికొన్ని భవనాలు వినియోగించక వృథాగా పడి ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించకపోతే వర్షాలకు కూలి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. భవనాలను వినియోగంలోకి తేకపోతే వాటి స్థలాలు అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉంది.

### అతిథి గృహం ఏర్పాటు చేయాలి



శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ సిబ్బంది నివాస గృహాలు తొలగించాలి. వాటి స్థానంలో అతిథిగృహాన్ని ఏర్పాటు చేయాలి. ఆమనగల్లు పట్టణంలో అతిథి గృహం లేక ఉన్నతాధికారులు, ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు పర్యటనలకు వచ్చినప్పుడు ఇబ్బందిగా మారింది. అదే స్థలాలను అతిథి గృహానికి కేటాయిస్తే సౌకర్యంగా ఉంటుంది.

\- నయ్యద్ ఖలీల్, ఆమనగల్లు

### ప్రభుత్వానికి నివేదించాం



నిరుపయోగంగా ఉన్న భవనాలు చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. గోదాంలను పరిశీలిస్తాం. వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంటే మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నిధుల మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపుతాం. శిథిలమైన క్వార్టర్స్ తొలగింపుకు ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే వాటిని తొలగిస్తాం.

\- కుసుమ మాధురి, ఎంపీడీవో, ఆమనగల్లు

## బస్సు చార్జీలను తక్షణమే తగ్గించాలి

- బీఆర్ఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రభాకర్



చేవెళ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టీసీ పెంచిన బస్సు చార్జీలను తక్షణమే తగ్గించాలని బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల మండలాధ్యక్షుడు పి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు టికెట్ ధరలను పెంచి పేద ప్రజలు, విద్యార్థులపై ఆర్థికభారం వేయడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆర్టీసీ చార్జీలు పెంచి సామాన్యుడిపై పెద్ద భారం మోపిందన్నారు. ఒక్కో టికెట్‌పై సుమారు రూ.10 పెంచిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఇప్పుడు అన్ని రకాల ధరలను పెంచుతుందన్నారు. ఆర్టీసీతో పాటు ఇటీవల వాహనాల రిజిస్ట్రేషన్ చార్జీలు, అంతకుముందు మద్యం ధరలు కూడా పెంచిందన్నారు. ఈవిధంగా చార్జీలు పెంచుతూ ప్రజల జీవితాలతో ఆటలు ఆడటం మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ మగవారికి చార్జీలు పెంచి ప్రజలను మోసం చేయడం సరైన పద్ధతి కాదని, పెంచిన బస్సు చార్జీలను తగ్గించకపోతే ప్రజలతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

క్రైం కార్నర్

కొత్తూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌నకు చెందిన రవిరాజ్(30) అనే వ్యక్తి జీవితం మీద విరక్తి చెంది మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు. ఆరేళ్ల క్రితం రవిరాజ్‌కు వివాహం జరిగింది. అయితే, ఇప్పటివరకూ సంతానం కలగలేదు. రెండు రోజుల క్రితం రవిరాజ్ కుటుంబసభ్యులు ఊరికి వెళ్లగా.. అతడు ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. ఈక్రమంలో రవిరాజ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రవిరాజ్ తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు.

## యువతి అదృశ్యం.. కేసు నమోదు



పుష్ప(ఫైల్)

మాడ్గుల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకొండ గ్రామానికి చెందిన తాండ్ర చెన్నమ్మ కూతురు పుష్ప కనిపించటం లేదని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం తల్లి ఫిర్యాదు చేసింది. కాగా, పుష్ప(25) హనుమకొండలోని చెవిటి, మూగ విద్యార్థులు చదివే కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ అక్కడే హాస్టల్లో ఉంటోంది. నాలుగు నెలల క్రితం కలకొండకు వచ్చి తిరిగి కాలేజీకి వెళతానని సెప్టెంబరు 9న వెళ్లిపోయింది. అనంతరం కాలేజీకి ఫోన్ చేసి పుష్ప గురించి తల్లి వాకబు చేయగా.. ఆమె అక్కడికి రాలేదని తెలిసింది. వార్డెన్‌ను చెన్నమ్మ వివరాలు అడగగా.. హాస్టల్‌కు రాలేదని తెలిపాడు. దాంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపతున్నట్లు తెలిపారు.

## ఆరుగురి బైండోవర్

కేశంపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పలు కేసులలో నేరస్తులుగా ఉన్న వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో పాత నేరస్తులుగా ఉన్న కొత్తపేట గ్రామానికి చెందిన దానగళ్ల భానుచందర్, కేశంపేటకు చెందిన లిక్కి జంగయ్య, కమ్మరి నర్సింలు, మహేష్, సిరిగిరి ఎల్లాస్వామిలను కేశంపేట తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి ఎదుట మంగళవారం హాజరుపరిచి బైండోవర్ చేశారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా వారిని బైండోవర్ చేశారని, ఎలాంటి నేరాలకు పాల్పడినా 6 నెలల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

కడ్తాల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు విధిగా పాటించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం సూచించారు. ట్రాఫిక్ నియమావళిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండడంతో పాటు తల్లిదండ్రులు అవగాహన కల్పిస్తే చాలావరకు ప్రమాదాలకు చోటుండదన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్(బాలుర)లో మంగళవారం విద్యార్థులకు రోడ్డు భద్రత నియమావళిపై షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై ట్రాఫిక్ రూల్స్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సిగ్నల్ ప్రాక్టీస్ చేయించి ట్రాఫిక్‌ను నియంత్రించే విధానం, జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డు దాటడం, వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలను ట్యాబ్ ద్వారా ఫొటో తీసి చలాన్ జనరేట్ చేయడం, ఫుట్‌పాత్‌పై మాత్రమే నడవడం వంటి అంశాలపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. హెచ్ఎం రాధాకృష్ణారెడ్డి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ

చేవెళ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఈనెల 9నుంచి 11వ తేదీ వరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసేందుకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు మంగళవారం తెలిపారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 9న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, చివరితేది 11న సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. 12న నామినేషన్ల పరిశీలన, 13న తిరస్కరింపబడిన నామినేషన్లపై అప్పీలు, 14న పరిష్కరణ, 15న నామినేషన్ల ఉపసంహరణ.. మధ్యాహ్నం 3గంటల వరకు ఉంటుందన్నారు. సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లు ప్రకటించి, 23వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ వైపు బీఆర్ఎస్ చూపు!

- ఎమ్మెల్యే శంకర్‌కు నాయకుల మద్దతు



ఎమ్మెల్యే శంకర్‌కు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. మండల పరిధిలోని మల్లాపూర్, మల్లాపూర్‌తండా, గుడూర్ ప్రాంతాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం షాద్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివెళ్లి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మద్దతు ప్రకటించారు. మల్లాపూర్‌నకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చెన్నారెడ్డి తన అనుచరులతో పెద్దయెత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. త్వరలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరుతామని చెన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆయా పార్టీల నాయకులు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, మున్సిపల్ శాఖల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, జె. సుదర్శన్‌గౌడ్, బాల్‌శౌరిరెడ్డి, జెనిగె జగన్, సాయిలు, శ్రీనునాయక్, జోజిరెడ్డి, పాశం కృష్ణ, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



చౌదరిగూడ : మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

కొందుర్గు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రణాళిక ప్రకారం ప్రశాంతంగా నిర్వహించాలని ఎంపీడీవో అనురాధ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై జోనల్, రూట్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రతీ అంశంలో అధికారులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తహసీల్దార్ ఆజంఅలీ, ఎంపీవో విజయకుమార్ పాల్, ఏవో సురేష్‌రెడ్డి, గణపతి, గోపీనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**చౌదరిగూడ** : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు సజావుగా నిర్వహించుకునేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ జోనల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, వంశీకృష్ణ, ఓంకార్‌లు పాల్గొన్నారు.



కొందుర్గు : శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అనురాధ

### సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట బందోబస్తు

ఆమనగల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ జానకిరాంరెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. సీఐ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల ఎంపీడీవోలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. ఆమనగల్లు మండలంలో 5 సమస్యాత్మక, తలకొండపల్లి మండలంలో 6 అత్యంత సమస్యాత్మక, 7 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు చెప్పారు. ఎంపీడీవోలు మాధురి, సుజాత, శ్రీకాంత్, ఎస్సైలు వెంకటేశ్, శ్రీకాంత్, వరప్రసాద్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

### పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఆమనగల్లు మండల పరిధిలోని శంకర్‌కొండ, మేడిగడ్డ తండాలో పోలింగ్ బూత్‌లను మంగళవారం ఎంపీడీవో కుసుమ మాధురి సందర్శించి వసతులను పరిశీలించారు. అన్ని బూత్‌లలో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, ర్యాంపులు, ఫ్యాన్లు, లైట్లు, తలుపులు, కిటికీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆమనగల్లు మండల పరిధిలో 23 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీవో వినోద, కార్యదర్శులు జగన్ నాయక్, విజయ, ఫీల్డ్ అసిస్టెంట్లు, బీఎల్వోలు, తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు : శంకర్‌కొండ తండాలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో మాధురి



కేశంపేట : కాకునూర్‌లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అధికారులు, పోలీసులు

### గొడవలు చేస్తే కఠిన చర్యలు

కేశంపేట : ఎన్నికల సమయంలో గొడవలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ నరహరి హెచ్చరించారు. మండల పరిధిలోని కాకునూర్, కొండారెడ్డిపల్లిలో మంగళవారం సాయంత్రం ఎంపీడీవో రవిచంద్రకుమార్, ఎంపీవో కిష్టయ్య, ఎస్ఐ రాజ్‌కుమార్ 12 మంది సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

## ఎగ్గిడి సత్తయ్యకు వీరేందర్‌గౌడ్ పరామర్శ




సత్తయ్యను పరామర్శిస్తున్న వీరేందర్‌గౌడ్

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామానికి చెందిన ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్ మంగళవారం ఉదయం పార్టీ నాయకులతో కలిసి సత్తయ్య నివాసానికి వెళ్లి పరామర్శించారు. వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజల సమస్యల పట్ల పోరాడుతూ బీజేపీని కందుకూరు మండలంలో మరింత బలోపేతానికి కృషి చేసిన సత్తయ్య ఐదు రోజుల క్రితం అనారోగ్యానికి గురై చికిత్స పొందినట్లు గుర్తుచేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. నిమ్మ అంజిరెడ్డి, రాఘవేందర్, రవీందర్‌గౌడ్, భూమిరెడ్డి, బొమ్మరాజు మల్లేష్, గౌర ప్రభాకర్, తదితరులున్నారు.

## సీపీఎం సీనియర్ నాయకుడు నర్సింహ మృతి

- నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్న నాయకులు



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచులూరు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నేత చిర్ర నర్సింహ(48) అనారోగ్యంతో చికిత్స పొందుతూ నిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఆయన మరణవార్త తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య రాచులూరుకు చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పార్టీ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు దుబ్బాక రాంచందర్, బి.సామేల్, జగదీశ్‌లతో కలిసి నర్సింహ మృతదేహం వద్ద నివాళులర్పించారు. పార్టీ నాయకులు బుట్టి బాల్‌రాజ్, ఎ.నరసింహ, శ్రీశైలం, శ్రీనివాస్, అంకగళ్ల కుమార్, ఆర్ చందు, నోముల నరసింహ, సిందం అంజయ్య, తదితరులు నివాళులర్పించారు.

## స్థానిక ఎన్నికల్లో సీపీఎం పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రాజ్

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు సీపీఎం అభ్యర్థులు బరిలో ఉంటారని.. పేద ప్రజల కోసం ప్రతినిత్యం పోరాటం చేస్తున్న తమ పార్టీకి వారే అండగా నిలుస్తారని ఆ పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని గూడూరు గ్రామ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బులు కోసం ప్రలోబపెట్టి గెలిచిన అభ్యర్థులు ప్రజల సమస్యలపట్ల ఏనాడూ పనిచేయరని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, బండి సత్తయ్య, శ్రీను, జంగయ్య, రాములు, అంజయ్య, జగన్, తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కల్పించాలి

ఆమనగల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): చట్టాలు, న్యాయవ్యవస్థపై బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ప్రజలకు అవగాహన కల్పించాలని కల్వకుర్తి జేఏసీ చైర్మన్ ఆయిల్ సదానందంగౌడ్ కోరారు. క్షణికావేశంలో కేసుల్లో ఇరికి ఇబ్బందులుపడే పేదలకు ఉచిత న్యాయ సలహాలు అందించాలని సూచించారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అండేకార్ యాదిలాల్, దుడ్డు ఆంజనేయులు యాదవ్‌కు బార్ అసోసియేషన్ కార్యాలయంలో సదానందంగౌడ్ అభినందన కార్యక్రమం నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. న్యాయవాదులు గణేశ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యాదిలాల్, ఆంజనేయులును సన్మానిస్తున్న సదానందంగౌడ్

## హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెంటయ్య

తలకొండపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఆశా కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య పిలుపు నిచ్చారు. ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఆశా కార్యకర్తల మండల మహాసభ నిర్వహించారు. పెంటయ్య అధ్యక్షతన సమస్యలపై చర్చించారు. ఈనెల 17న షాద్‌నగర్‌లో నిర్వహించే జిల్లా మహాసభలకు ఆశా కార్యకర్తలు తరలి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎం.సుజాత, ప్రధాన కార్యదర్శిగా డి.విమల, కోశాధికారిగా మాధవి, ఉపాధ్యక్షురాలిగా చంద్రకళ, సహాయ కార్యదర్శిగా సునితలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సీఐటీయూ నాయకులు సత్కరించారు.

## మెడిసిన్ విద్యార్థినికి చేయూత

ఆమనగల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మెడిసిన్ విద్యార్థినికి తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. మాడ్గుల మండలం కలకొండకు చెందిన నాయిని సత్యనారాయణ కూతురు కావేరి మెడికల్ సీటు సాధించింది. మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వెంకటేశ్ రూ.15 వేలు సమకూర్చగా ట్రస్ట్ సభ్యులు అందజేశారు. గణేశ్, వీరబొమ్మ బుచ్చిబాబు, శేఖర్, సాయి, తదితరులు ఉన్నారు.

## గ్రూప్-2 ఉద్యోగికి సన్మానం



చేవెళ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని వివేకానంద కళాశాలలో 2016-2018లో ఇంటర్మీడియట్ సీఈసీ చదివిన శివమణి ఇటీవల గ్రూప్-2లో మంచి ర్యాంకు సాధించి సెక్రటేరియట్‌లో ఏఎస్వోగా ఉద్యోగం పొందాడు. మంగళవారం ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు ఆయన్ను సన్మానించారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

కొందుర్గు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను యువకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రం బస్‌స్టాండ్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బోయ శంకర్ మాట్లాడుతూ యువకులు వాల్మీకీని ఆదర్శంగా తీసుకోవాలని, ప్రతీఒక్కరు ధర్మాన్ని పాటించి, వాల్మీకి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. జీబీ కృష్ణ, ప్రశాంత్, మహేశ్, వీరయ్య, శేఖర్, నర్సింలు, యాదయ్య, అంజయ్యలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న యువకులు